




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 238 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 16-12-2025 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## తక్కువ స్థానాలతో బీజేపీకి ఘోర పరాభవం

- 3911 స్థానాల్లో గెలిచింది 6.5 శాతం
- కేవలం 236 స్థానాల్లోనే విజయం
- రెండు, మూడు జిల్లాల్లోనే ప్రభావం

**హైదరాబాద్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ పంచాయతీ పోరులో కమలం వాడిపోయింది. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపిలు ఉన్న బిజెపి పల్లెల్లో మాత్రం పట్టుకోల్పోయింది. గ్రామ పంచాయతీలకు జరిగిన రెండు విడతల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో కనీసం సగం కూడా సాధించలేక ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నది. తొలి విడతలో దారుణంగా ఓటమిపాలైన బిజెపి కేవలం 189 పంచాయతీల్లో గెలుపొందింది. రెండో విడతలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన 3,911 స్థానాల్లో కేవలం 236 స్థానాల్లో (6.5 శాతం) మాత్రమే బిజెపి మద్దతుదారులు -మిగతా 2 లో



# తుది పోరు సిద్ధం

### ముగిసిన మూడోదశ పోలింగ్ ప్రచారం


- 17న పోలింగ్... మూడ్రోజులపాటు మద్యం బంద్
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్
- తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు
- తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం





**హైదరాబాద్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియగా, బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్నాయి. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో -మిగతా 2 లో

## మూడు దేశాల పర్యటనలో ప్రధాని మోదీ.

- జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోడీ
- ఘనంగా స్వాగతించిన భారత సంతతి ప్రజలు



**అమ్మాన్,**
భారతీయ సంతతి భారత్-జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక -మిగతా 2 లో



## గాయకుడు బాలు అందరివాడు


- మన తెలుగవాడు కావడం గర్వకారణం
- స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం
- బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు
- హాజరైన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు,

**హైదరాబాద్,డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, -మిగతా 2 లో



## దేవుని విశ్రాంత వేళల్లో ప్రత్యేక పూజలా..?

- దేవతలకు విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటి
- ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలి
- అసహనం వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు..!



**న్యూఢిల్లీ**
ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బృందావన్‌లోని ఓ ఆలయ దర్శన వేళల్లో మార్పులకు సంబంధించిన కేసుల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బృందావన్‌లోని బాంకీ బిహారీ ఆలయం లో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తంచేసింది.దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం -మిగతా 2 లో

## పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

### బీఆర్ఎస్ రెండోవిడతలోను అద్భుత ఫలితం

- కాంగ్రెస్ మోసాలతో ప్రజలు విసుగెత్తారు
- రేవంత్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టం
- పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపిన కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం -మిగతా 2 లో

-మిగతా 2 లో

## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్

- అమిత్ షా - నడ్డా సమక్షంలో ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబిన్




**న్యూఢిల్లీ,**
బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ మంత్రి నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర పార్టీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న తర్వాత నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. అమిత్ షా, నడ్డా, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా సహా వివిధ -మిగతా 2 లో




## ఉపాధిహామీని దెబ్బతీసే కుట్ర

- పేదలను, రాష్ట్రాలను వంచిస్తున్న కేంద్రం
- కొత్త చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలి: సీతక్క

**హైదరాబాద్ డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. పథకం పేరునే కాకుండా దాని ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం తన -మిగతా 2 లో

## అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం



- తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు
- తన పోరాటంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు
- ఆయన మృతితో తెలుగు తమ్ముళ్లు బయటకు వచ్చి పోరాడారు
- 58 అడుగుల విగ్రహం ఏర్పాటు
- సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అందులో 58 అడుగుల ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం -మిగతా 2 లో

-మిగతా 2 లో

### తక్కువ స్థానాలతో బీజేపీకి

# ఘోర పరాభవం

(మొదటి తరువాయి)

విజయం సాధించగలిగారు.ఆదిలాబాద్, మంచిర్యాల మినహా మిగిలిన ఏ జిల్లాలోనూ బిజెపి కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. రెండు విడతల్లో ఆ పార్టీ కేవలం 435 స్థానాలతో సరిపెట్టుకున్నది. రెండు విడతల్లో స్వతంత్ర అభ్యర్థులు 1,161 స్థానాల్లో గెలుపొందారు. అందులో సగం కూడా బిజెపి కి రాకపోవడం కమలనాథుల దయనీయస్థితికి అద్దంపడుతున్నది. కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గమైన కరీంనగర్‌తోపాటు ఎంపి ఈటల గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్‌లోనూ బిజెపి మద్దతుదారులు ఓటమిపాలవడం చర్చనీయాంశమైంది. మరో ఎంపి రఘునందన్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లో కనీసపోటీ ఇవ్వక పోవడంతో బిజెపి ఉనికి ప్రశ్నార్థకమైంది. బిఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రత్యామ్నాయం తామేనని ఊదరగొట్టే బిజెపి రాష్ట్ర నేతల మాటలు కేవలం వట్టివేనని రెండు విడతల పంచాయతీ ఎన్నికల ఫలితాలతో ఖరారయిపోయింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 30 శాతానికిపైగా ఓట్లు సాధించడం, 8 సీట్లలో గెలుపొందడం గాలివాటమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ముమ్ముందు తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేని పేర్కొంటున్నారు.

## మూడు దేశాల పర్యటనలో ప్రధాని మోదీ.

(మొదటి తరువాయి)

భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం. ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్–జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఎఎ ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

## దేవుని విశ్రాంత వేళల్లో ప్రత్యేక పూజలా..?

(మొదటి తరువాయి)

సమంజసం కాదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నతస్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే కోర్టుకు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని, కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. దేవతలకు విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలని అధికారులను ఆదేశించింది.

## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్

(మొదటి తరువాయి)

నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి నబిన్ మాట్లాడుతూ.. నాలాంటి చిన్న కార్యకర్తకు పార్టీ చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్నారు. కార్యకర్తల నిబద్ధత, కృషిని పార్టీ గుర్తిస్తుందనడానికి ఇదే నిదర్శమని చెప్పారు. దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను నిలబెట్టింది. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న నబిన్ బీహార్ ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నితిన్ నబిన్ ను నియమించింది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాల సమాచారం.

## ఉపాధిహామీని దెబ్బతీసే కుట్ర

(మొదటి తరువాయి)

నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను ఆమె తప్పుబట్టారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆక్షేపించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును ' వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును ఆమె తప్పుబట్టారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చించి.. పథకాన్ని అమలు చేసిన కేంద్రం ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని మంత్రి సీతక్క అన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని సీతక్క ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతోందని విమర్శించారు.

# తుది పోరుకు సిద్ధం

(మొదటి తరువాయి)

394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకో నున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఎన్నికలు జరగనున్న గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. 2గంటల నుంచి కౌంటింగ్ జరిగిప ఫలితాలు ప్రకటిస్తారు. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్



దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి. మూడో విడతలో మొత్తం 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయాలు సాధిస్తుండగా.. మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతున్నారు. అంతేకాకుండా.. కొన్ని కొన్ని చోట్ల ఓట్లు సమంగా రావడంతో అభ్యర్థులు చివరకు టాస్ తో విజయం సాధిస్తున్నారు.

# పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

(మొదటి తరువాయి)

చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా మరోసారి తేల్చిచెప్పారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనమని పేర్కొన్నారు.రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్ కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని అన్నారు.కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార



పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం అన్నారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# గాయకుడు బాలు అందరివాడు

(మొదటి తరువాయి)

మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శనమన్నారు.మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

# అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం

(మొదటి తరువాయి)

విజయవాడలోని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు పోరాడారని తెలిపారు. ఆయన ఆత్మార్పణంతో రాష్ట్రం రగిలిపోయిందని గుర్తు చేశారు.తెలుగుజాతి గుర్తింపు కోసం పోరాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగుజాతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన వ్యక్తి ఆయన అని కొనియాడారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు పోరాటం చేశారన్నారు. తన పోరాటంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. 1952లో మద్రాస్‌లోని బలుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు.58 రోజులపాటు నిరాహార దీక్ష చేసి చనిపోయారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆయన మృతితో తెలుగు



తమ్ముళ్లు బయటకు వచ్చి పోరాడారు. దీంతో తెలుగువాళ్లకు ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని అప్పటి ప్రధాని ప్రకటించారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన రోజును స్మరించుకుంటున్నాం. త్యాగం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులను గౌరవించుకోవడం మన సంప్రదాయం. అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం 6.8 ఎకరాలు కేటాయించాం. 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచిన భవనాన్ని స్మారక కేంద్రంగా మారుస్తాం. పొట్టి శ్రీరాములు ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు.. తెలుగు ప్రజల ఆస్తి అని చంద్రబాబు అన్నారు.ఇదిలావుంటే అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళు లర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం స్పందిస్తూ.. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే దృఢ నిశ్చయంతో పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రత్యేక రాష్ట్రం పోరాడారని అన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ధీరోదాత్తుడు పొట్టి శ్రీరాములు అని సీఎం తెలిపారు. ఆ మహనీయుడు ప్రాణ త్యాగ ఫలమే ఈ రోజు మనకున్న భాషాప్రయుక్త రాష్ట్రాలని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు.

# ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్ యూత్ కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్ స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి స్వామి గార్లు అయ్యప్ప స్వామి దీక్షను నలభై ఒక రోజులు పూర్తి చేసుకొని శబరిమాల సన్నిధానానికి బయలుదేరిన సందర్భంగా ఈరోజు ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి గారు పాల్గొని భక్తులతో కలిసి అయ్యప్ప స్వామి సేవలో భాగమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పద్మ రావు, సీనియర్ నాయకులు శామీర్‌పేట్ ప్రకాష్ రావు, గురువా రెడ్డి తదితరులు హాజరై భక్తులతో కలిసి అయ్యప్ప స్వామి నామస్మరణలో మునిగిపోయారు. భక్తి, భవ్యం, ఉత్సాహం నిండిన ఈ ఇరుముడి కార్యక్రమం శబరిమాల యాత్రకు సన్నద్ధమవుతున్న భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.

# పచ్చదనాన్ని కాపాడుకోవాలి



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుందిగల్ డబుల్ బెడ్రూం సముదాయంలో మొదటి బ్లాక్ లబ్ధిదారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, ఉమ్మడి ఖుత్బుల్లాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుందిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వయంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనాన్ని కాపాడుతూ పెంపొందించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పచ్చని వాతావరణం భవిష్యత్ తరాలకు అందించాల్సిన ఆస్తి అని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలనే సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, సాదూ యాదవ్, సల్మాన్ రాజ్, 1వ బ్లాక్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, కమిటీ సభ్యులు సతీష్‌తో పాటు మహిళలు, డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ కృతనిశ్చయాన్ని వ్యక్తం చేశారు.

# యాంటీ కరప్షన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా జనముల ప్రశాంత్ ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం కాలనీకి చెందిన జనముల ప్రశాంత్ ముదిరాజ్ యాంటీ కరప్షన్ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా (విజిలెన్స్, క్రైమ్ సెల్) నియమితులయ్యారు. చిక్కడపల్లి త్యాగరాజ జ్ఞాన సభలో జరిగిన యాంటీ కరప్షన్ ఫౌండేషన్ స్టేట్ కమిటీ సమావేశంలో ఈ నియామకం అధికారికంగా ప్రకటించబడింది. ఈ సందర్భంగా ప్రశాంత్ ముదిరాజ్ అవినీతి ఎక్కడ జరిగినా ప్రశ్నిస్తానని, నిబద్ధతతో పని చేస్తానని ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన అవినీతి నిర్మూలనలో ప్రజలతో కలిసి కృషి చేస్తానని సంకల్పం వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ డైరెక్టర్ తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, డైరెక్టర్ దొడ్ల నాగేష్ రెడ్డి, యాంటీ కరప్షన్ ఫౌండేషన్ టీం సభ్యులు పాల్గొని కొత్తగా నియమితులైన వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.






# అభివృద్ధి నా ధ్యేయం మీ ఆశీర్వాదమే నా బలం

**హుస్నాబాద్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మీర్జాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో వేల్పుల సంపత్ కుమార్ సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నారు. గ్రామాభివృద్ధే తన జీవిత లక్ష్యమని పేర్కొంటూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, శుద్ధ త్రాగునీరు, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులను క్రమబద్ధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే గ్రామ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిన హనుమాన్ దేవాలయంలో అవసరమైన నిర్మాణ పనులు చేపట్టి భక్తులకు మరింత సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. విద్యారంగంలో పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదలతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఆరోగ్య రంగంలో నెలవారీ వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామ ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. శుభ్రత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలతో పరిశుభ్రమైన మీర్జాపూర్‌గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణలు, చెరువుల పునరుద్ధరణ ద్వారా సాగునీటి వసతుల మెరుగుదల చేస్తామని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వావలంబన దిశగా నడిపిస్తామని, యువత కోసం క్రీడా మైదానం, కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారి ప్రతిభకు వేదిక కల్పిస్తామని పేర్కొన్నారు. పారదర్శక పరిపాలనే తన పాలనకు పునాదిగా ఉంటుందని, ప్రతి నెల గ్రామ సభలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను న్యాయంగా, అర్హులైన వారికి అందేలా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. మీర్జాపూర్ అభివృద్ధి కోసం తనకు ప్రజల సహకారం, ఆశీర్వాదం అవసరమని కోరారు.

# అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

## - నూతన సర్పంచులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి హితవు

**మానకొండూర్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హితవు పలికారు. మానకొండూర్ నియోజకవర్గంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రజల మద్దతుతో గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజల సమస్యల



పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు, విద్యుత్ వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్రామాభివృద్ధి సాధించినప్పుడు ప్రజల అభిమానాన్ని చూరగొనగలరని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ పంచాయతీలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వల్ల ప్రజలు కాంగ్రెస్‌కు పట్టంగట్టారని తెలిపారు. ఇదే హవా మూడో విడత ఎన్నికల్లోనూ కొనసాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం బలంగా ఉండటంతో పలు గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు మద్దతుదారులు పోటీ చేయడం వల్ల కొన్నిచోట్ల గెలుపు చేజారిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, మానకొండూర్ మండలాల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, నందగిరి రవీంద్రచారి, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీగిరి రంగారావు, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్యతో పాటు అనేక మంది కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నిషేధాజ్ఞలు

**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల ప్రశాంత నిర్వహణ కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజురాబాద్, వి. సైదాపూర్ మండలాల్లో అమలులో ఉంటాయి. ఈ మండలాల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం, సమావేశం కావడం పూర్తిగా నిషేధించబడింది. అమలు కాలం మరియు హెచ్చరికలు - ఈ నిషేధాజ్ఞలు డిసెంబర్ 15, 2025 సోమవారం సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 17, 2025 బుధవారం రాత్రి 11:59 గంటల వరకు అమలులో ఉంటాయి. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగేందుకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పెద్దపల్లి -మంచిర్యాల అభివృద్ధి ప్రాజెక్టులు

**పెద్దపల్లి, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



పెద్దపల్లి -మంచిర్యాల జిల్లాలకు సంబంధించిన రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై ఎంపీ పార్లమెంట్‌లో కేంద్ర రైల్వే, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ప్రశ్నించారు. దీనిపై మంత్రి సమగ్ర వివరాలతో సమాధానం ఇస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో తెలంగాణకు రావాల్సిన సెమీకండక్టర్ ఫెసిలిటీని రాజకీయ కారణాలతో ఆంధ్రప్రదేశ్‌కు తరలించడంపై ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు తెలంగాణలో అమలు అయ్యి ఉంటే వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగేవని ఆయన పేర్కొన్నారు. సెమీకండక్టర్ ఫెసిలిటీపై వినతి - ఎంపీ వ్యక్తిగతంగా మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి, పెద్దపల్లి -మంచిర్యాల ప్రాంతంలో నీటి వనరులు, భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన యువత ప్రతిభను వివరించారు. రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్, సింగరేణి సంస్థల విజయాలను ఉదాహరణగా చూపుతూ, ఈ ప్రాంతం పరిశ్రమలకు అత్యంత అనుకూలమని తెలిపారు. సెమీకండక్టర్ ఫెసిలిటీ ఏర్పాటు అయితే రాష్ట్ర అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు గణనీయమైన ప్రయోజనం ఉంటుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం స్పష్టమైన ప్రపోజల్ ఇవ్వాలని సూచించగా, అన్ని అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.

# నన్ను నమ్మి ఓటేయండి... నమ్మకంగా పనిచేస్తా

**కొండపాక, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో స్వతంత్ర అభ్యర్థిగా కర్రోళ్ల నాగరాజు ప్రజల ముందుకు వస్తున్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఆయనను కూరెళ్ల గోవర్ధన్ రెడ్డి బలపరుస్తూ సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టారు. గ్రామంతో విడదీయరాని అనుబంధం కలిగిన గోవర్ధన్ రెడ్డి ఇప్పటివరకు తిమ్మారెడ్డిపల్లికి ఎన్నో సేవలు అందించారు. తాను చదువుకున్న పాఠశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అక్కడ పనిచేస్తున్న విద్యా వాలంటరీలకు నెలవారీ వేతనాలు తన వంతుగా అందిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరిస్తూ వస్తున్నారు.విద్యతో పాటు యువత భవిష్యత్తుపైనా ఆయనకు ప్రత్యేకమైన చిత్తశుద్ధి ఉంది. యువకులకు చదువు, ఉద్యోగ అవకాశాల విషయంలో అవసరమైన సహాయం అందిస్తూ గ్రామంలో అందరి మన్ననలు పొందుతున్నారు. ఇలాంటి సేవాభావంతో గ్రామాన్ని మరింత ముందుకు నడిపించాలంటే యువకుల చేతుల్లోనే గ్రామపాలన ఉండాలని భావించిన గోవర్ధన్ రెడ్డి, అదే ఆలోచనకు ప్రతిరూపంగా కర్రోళ్ల నాగరాజును సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టారు.గ్రామంలోని రైతుల సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల ఇబ్బందులు, అభివృద్ధి అవసరాలపై పోరాడేందుకు తాను ముందుంటానని కర్రోళ్ల నాగరాజు ప్రచారంలో స్పష్టం చేస్తున్నారు. గ్రామం కోసం నిజాయితీగా పనిచేసే అవకాశం ఇవ్వాలని కోరుతూ, కత్తెర గుర్తుకే ఓటేసి కర్రోళ్ల నాగరాజును గెలిపించాలని గోవర్ధన్ రెడ్డి ప్రజలను కోరుతున్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా, నమ్మకమే ఆయుధంగా ఈ పోరాటం సాగుతోందని ఆయన పేర్కొన్నారు.




# నా దేవరకొండ ప్రజలకోసం నీడలానిలుస్తా





**-ఆపదలో అండగా ఉంటా.**
**-మాటిచ్చిన పనులన్నీ పూర్తిచేస్తా..**
**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**

**దేవరకొండ డిసెంబర్ 15. నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ నియోజక వర్గంలోని గుడిపల్లి, ఘణపురం, వద్దిపట్ల , అజ్మాపూర్ గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రానున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా గ్రామాలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు.ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యలను పరిష్కరించే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని ఆయన పేర్కొన్నారు.అభ్యర్థులు గెలిస్తేనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాలు ప్రజల గడపకు చేరుతాయి" అని ఆయన అన్నారు.అభ్యర్థులకు ప్రజలంతా ఏకమై మద్దతు ఇవ్వాలని, భారీ మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడో విడత ఎన్నికల్లో పోలీసు భద్రత కట్టుదిట్టం

**చారకొండ ఎస్ఐ వీరబాబు**




**చారకొండ, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థల మూడో విడత ఎన్నికల నేపథ్యంలో చారకొండ మండల కేంద్రంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారని ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఎస్ఐ వివరించిన ప్రకారం, 17 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో ఎర్రవెల్లి గ్రామపంచాయతీ బైక్ కాడ్ చేయబడింది. కమల్‌పూర్, సేరి, అప్పరెడ్డిపల్లి గ్రామాల్లో నాలుగు వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగతా నాలుగు వార్డుల్లో యథావిధిగా పోలింగ్ జరగనుంది. అదేవిధంగా 14 గ్రామపంచాయతీలకు 122 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని ఆయన తెలిపారు.ఎస్ఐ వీరబాబు మాట్లాడుతూ, ఎలాంటి అపోహలకు తావు లేకుండా ప్రజలు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. కల్వకుర్తి డీఎస్పీ సై రెడ్డి వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయని, మొత్తం 87 మంది పోలీసులు భద్రతా పనుల్లో పాల్గొంటున్నారని వివరించారు.

# సంగారెడ్డిలో సర్పంచ్ అభ్యర్థులకు బిజెపి ప్రచారం



**సంగారెడ్డి , డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డ్ మెంబర్ల తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి పాల్గొని ప్రజలను అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి, అడ్వకేట్ బస్వారాజ్, రవికుమార్ గౌడ్, రాజశేఖర్ పాటిల్, దశరథ్, జ్ఞానేశ్వర్, ప్రతాప్ పాటిల్, నాగిశెట్టి, కనికేందర్, విలాసరావు, విట్టల్ తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# శాతవాహన కాలమ్ -బి.ఎడ్ పరీక్ష రుసుము గడువు




**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బి.ఎడ్ కోర్సు ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన రుసుము గడువును విడుదల చేసింది. రెగ్యులర్, బ్యాక్లాగ్ విద్యార్థులు డిసెంబర్ 24లోపు ఫీజు చెల్లించాలి. ఆలస్యంగా చెల్లించేవారికి రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 30 వరకు అవకాశం కల్పించారు. పరీక్షలు జనవరి 2026లో జరగనున్నాయని అధికారులు తెలిపారు. ఇతర వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించవచ్చని పరీక్షల నియంత్రణాధికారి డా.డి. సురేష్ కుమార్ పేర్కొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్




**అల్విన్ కాలనీ, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయడం వల్ల పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా బస్తీకి వచ్చే ఆటోలలో మాత్రమే వేయాలని, చెత్తను నాలాలలో, రోడ్లపై, చెరువుల్లో వేయరాదని ప్రజలను కోరారు. పరిశుభ్రత కోసం జి.ఎచ్.ఎం.సి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.అలాగే పారిశుధ్య, ఎంటమాలజీ, వైద్య శాఖలకు చెందిన సిబ్బంది ఇంటింటికి వచ్చి అందించే సేవలకు ప్రజలందరూ సహకరించాలని, వారి సూచనలు పాటిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు జూపల్లి జనార్దన్ రావు, నాగేశ్వరావు, దేవేందర్ రావు, జీవన్ రెడ్డి, జంగారెడ్డి, మహీందర్ రావు, ఎల్లయ్య, బాలాజీ, వెంకటరెడ్డి, రమేష్ సేటు, అశోక్ రావు, జి.ఎచ్.ఎం.సి శానిటేషన్ సూపర్వైజర్ మనోహర్ రెడ్డి, ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, ఎస్.ఎఫ్.ఏలు మల్లేష్, వెంకటరెడ్డి, జి.ఎచ్.ఎం.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసిన దోరెపల్లి గ్రామ సర్పంచ్



**నల్లగొండ, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 11న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కనగల్ మండలం దోరపల్లి గ్రామం సర్పంచ్ గా గెలుపొందిన బక్క ఎల్లమ్మ సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపల్లి వీరసేనారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు
ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సర్పంచ్ ఎల్లమ్మను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేమిరెడ్డి రవీందర్ రెడ్డి, కడారి శంకర్, మన్నెం శ్రీనివాస్, భైరగోని దుర్గయ్య , మన్నెం మల్లేష్, మాధగోని సైదులు, బక్క రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

# అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమానికి విరాళం

**జాలేనరసింహారెడ్డి.**



**దేవరకొండ డిసెంబర్ 15. (నీలగిరి ఎక్స్‌ప్రెస్).**
దేవరకొండ పట్టణంలోని మహబూబ్ నగర్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవ కార్యక్రమానికి పిఏసియస్ చైర్మన్ జాలా నరసింహ రెడ్డి 15 క్వింటాల బియ్యం విరాళం అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి ని శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదం తీసుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రాంత ప్రజలపై ఆ అయ్యప్పస్వామి ఆశీస్సులు ఉండి సకాలంలో వర్షాలు కురిసి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

# ఎస్సార్ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో నూతన పుస్తకావిష్కరణ



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), కరీంనగర్ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ పడాల తిరుపతి రచించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జీవశాస్త్రం- వృక్షశాస్త్ర విభాగం పాఠ్యపుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ ఆవిష్కరించారు. అదే విధంగా, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పీజీ బాటనీ విద్యార్థులకు ఉపయోగపడే నాన్వెస్కులర్ ప్లాంట్స్ (నాళిక కణజాల రహిత మొక్కలు) అనే పుస్తకాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించిన ఈ పాఠ్యపుస్తకం కళాశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విశిష్టమైన పుస్తకావిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, సులభమైన వర్ణన, సమకాలీన చిత్రాలతో రూపొందించిన ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, రచయిత డాక్టర్ పడాల తిరుపతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరు కోవెల శ్రీనివాస్, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి కామాద్రి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మామిడిపల్లి సత్యప్రకాశ్, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మధు రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఉమారాణి, రసాయనశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ తాండ్ర కరుణాకర్, వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ రౌతు రాధాకృష్ణ, డాక్టర్ మహమ్మద్ తాహిర్ హుస్సేన్, డాక్టర్ కందుకూరి కళాజ్యోతి, డాక్టర్ బుంగ తిరుపతి, డాక్టర్ మహమ్మద్ తాజుద్దీన్, ఆసంపల్లి స్వరూప రాణి, జంతుశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ తోట మహేష్, డాక్టర్ ఆసంపల్లి నాగరాజు తదితర అధ్యాపకులు మరియు నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరజీవి వర్ధంతి వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్ ఆధ్వర్యంలో అమరజీవి విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది వేణుగోపాల్, కోశాధికారి సుద్దాల వెంకటేశ్, వాసవి దేవస్థానం చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, సంకష్ట కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం, బిజెపి నాయకుడు వంగల పవన్ పాల్గొన్నారు. అలాగే వివిధ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘాల అధ్యక్షులు దొంతుల మనోహర్, కాచం రమేశ్, కొల్లూరి హరిప్రసాద్‌తో పాటు ఆర్యవైశ్య నాయకులు కూడా హాజరయ్యారు.

# పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు రాష్ట్రాల ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన విగ్రహం వద్ద పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించారు. తెలుగు జాతి ఐక్యత కోసం, భాషా గౌరవం కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయికృష్ణ, పట్టణ సంఘం యువజన విభాగ ప్రధాన కార్యదర్శి సాయి కన్నా, కైలాస నవీన్‌తో పాటు పలువురు యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు గారి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడిచి సమాజానికి సేవ చేయాలని వారు పిలుపునిచ్చారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 163 బీఎన్ఎస్ఎస్ అమలు



**పెద్దపల్లి, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 17న జరగనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పెద్దపల్లి జోన్‌లోని సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల మండలాలతో పాటు మంచిర్యాల జోన్ పరిధిలోని భీమారం, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, మందమర్రి మండలాల్లో అమలులో ఉంటాయి. ఎన్నికల సమయంలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడకూడదని, చట్టబద్ధమైన సమావేశం నిర్వహించాలంటే సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరి అని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు డిసెంబర్ 15 సాయంత్రం 5 గంటల నుండి ప్రారంభమై, డిసెంబర్ 17న ఎన్నికల కౌంటింగ్ పూర్తై ఫలితాలు వెలువడే వరకు అమలులో ఉంటాయి. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

# ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వారీగా ఎన్నికల సిబ్బంది కేటాయింపు ర్యాండమైజేషన్ విధానంలో పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించగా, అనంతరం జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్‌తో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. మూడవ విడత ఎన్నికలు జరగనున్న మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఇతర ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు.

# కమాన్‌పూర్‌లో డంపు యార్డు ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి రూరల్ మండలం కమాన్‌పూర్ గ్రామంలో డంపు యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపల్లిలో ఆయన మాట్లాడుతూ, కమాన్‌పూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 116లోని దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డంపు యార్డు కోసం కేటాయించడం ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను రేపుతోందని తెలిపారు. ఆయన పేర్కొన్నదాని ప్రకారం, ఆ భూమిలో సగం ఎల్ఎండి బ్యాక్ వాటర్ కింద ఉండగా, మరికొంత గుట్టల కింద ఉంది. మిగిలిన భూమిని గ్రానైట్ వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. అదే సర్వే నెంబర్‌లో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిందని, ఆ ఇండ్లకు సమీపంలో డంపు యార్డు ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. స్థానిక ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కుంట తిరుపతి మాట్లాడుతూ, డంపు యార్డు ఏర్పాటు పట్ల గ్రామ ప్రజలంతా తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ప్రజలను గోస పెట్టే నిర్ణయాలు తీసుకోవద్దని హెచ్చరించారు. ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని ఐకెపి సెంటర్‌కు కేటాయించాలని కూడా ఆయన కోరారు.

# పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



**పెద్దపల్లి, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి మండలంలోని బొంపల్లి, కనగర్తి, పాలితం, కాసులపల్లి, తుర్కలమద్దికుంట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత కరెంటు, రెండు లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10 లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, వడ్ల కొనుగోలు వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వమే అందిస్తున్నదని వివరించారు. తాను సూచించిన అభ్యర్థులు గెలిస్తే గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించి మరింత సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ ఆఫ్ అప్రిషియేషన్ అవార్డు అందుకున్న ముత్యం శంకర్ గౌడ్



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ క్లబ్ సభ్యులను అధిక సంఖ్యలో చేర్పించినందుకు గుర్తింపుగా, లయన్స్ ఇంటర్నేషనల్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మార్క్ లయోను చేతుల మీదుగా కరీంనగర్ మానేరుక్లబ్ ప్రెసిడెంట్ ముత్యం శంకర్ గౌడ్‌కు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిషియేషన్ అవార్డు హైదరాబాదులోని విశ్వేశ్వరయ్య భవనంలో అందజేశారు. ఈ సందర్భంగా ముత్యం శంకర్ గౌడ్ మాట్లాడుతూ, లయన్స్ క్లబ్‌ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. లయన్స్ పెద్దల ఆశీర్వాదంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో 320జి గవర్నర్ సింహరాజు కోదండరాములు, ఫస్ట్ గవర్నర్ మెగా బద్రిశం, ఇతర లయన్స్ పెద్దలు పాల్గొన్నారు.

# సిఐటియు 18వ జాతీయ మహాసభల పతాకావిష్కరణ



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిఐటియు అఖిలభారత 18వ జాతీయ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరగనున్నాయి. ఈ మహాసభల నేపథ్యంలో కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఫ్యాక్టరీలు, పని ప్రదేశాల్లో పతాకావిష్కరణలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం గంజ్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి పతాకావిష్కరణ చేసి, కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి, పోరాటాల రూపకల్పనకు ఈ మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడులను ప్రవేశపెట్టిందని, విద్యుత్ సవరణ బిల్లు ప్రజలకు, రైతులకు నష్టదాయకమని పేర్కొన్నారు. "శ్రమశక్తి నీతి" పేరుతో ప్రకటించిన విధానాలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని, విదేశీ పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ చర్యలతో ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మిక వర్గం దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవుల రాజయ్య, దాడి సురేందర్, సుక్క కుమార్, ఆవుల లక్ష్మణ్, సంపత్, బిక్షపతి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ సర్పంచుల ఘనవిజయం



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: కరీంనగర్ నియోజకవర్గంలోని 20 గ్రామాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 11 మంది కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచులుగా విజయం సాధించారు. ఈ విజయానికి కీలక పాత్ర పోషించిన వెలిచాల రాజేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పెద్దపీట వేస్తామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రాజేందర్ రెడ్డి ఎన్నికల్లో అహర్నిశలు కృషి చేసి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి వైపు కాంగ్రెస్ బెదిరింపుల వైపు బీఆర్ఎస్



**హుజురాబాద్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుజురాబాద్, ఇల్లందుకుంట, జమ్మికుంట మండలాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, ఈ నెల 17న జరగనున్న మూడవ విడత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం అవసరమని, పార్టీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ప్రణవ్ మాట్లాడుతూ, పదేళ్లు అధికారంలో ఉన్నా గ్రామ సమస్యలను పరిష్కరించని బీఆర్ఎస్ ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. బెదిరింపు రాజకీయాలు తప్ప కౌశిక్ రెడ్డి నియోజకవర్గానికి చేసినది ఏమీ లేదని, ప్రజలకు ఉపయోగం లేని నాయకులను ఎన్నుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. ఊరికి మంచి చేసే నాయకులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని, బుధవారం జరిగే ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు.

# నిజామాబాద్‌లో పెన్షనర్స్ డే క్రీడా పోటీలు ప్రారంభం




**నిజామాబాద్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అఖిల భారత పెన్షనర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలు నిజామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జిల్లా శాఖ ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి జీవితకాలం సేవలందించిన పెన్షనర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పెన్షన్ల బకాయిలు, వైద్య సౌకర్యాలు, ఆరోగ్య బీమా, డి.ఏ. బకాయిలు వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కాని స్థితిలో ఉన్నాయని, విశ్రాంత ఉద్యోగులు గౌరవప్రదమైన జీవితం గడపాల్సిన హక్కు ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తాను అసెంబ్లీలోనూ, ప్రజల మధ్యనూ పెన్షనర్ల హక్కుల కోసం పోరాడుతానని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజా కార్యక్రమాలకు పరిమితమై, పెన్షనర్ల వాస్తవ సమస్యలను పక్కన పెట్టడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఆరోగ్యం, ఐక్యత, సామాజిక స్ఫూర్తిని పెంపొందించే ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ప్రశంసనీయం అయినప్పటికీ, పెన్షనర్ల జీవన భద్రతకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సిందేనని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్లలో బిజెపి విజేతలకు సన్మానం



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బిజెపి బలపరిచిన సర్పంచ్, ఉపసర్పంచ్ అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంత కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజి రెడ్డి పాల్గొన్నారు. తంగళ్ళపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్, చింతలఠాణ గ్రామ సర్పంచ్ గుర్రం అనసూర్య -మహేందర్, సారంపల్లి గ్రామ ఉపసర్పంచ్ సిరిసిల్ల వంశీని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుర్రం సత్తయ్య, వంతడుపుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై నిరసన



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ స్మార్ట్ సిటీ పరిధిలోని మూడో డివిజన్ కిసాన్ నగర్ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బిజెపి నేత, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీడీ కంపెనీ నుండి మీ సేవ వరకు "మా ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి" అంటూ పోర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిసాన్ నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎన్నో వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. వర్షాకాలంలో రోడ్లు, మురికి కాలువలు దారుణ స్థితికి చేరుతున్నాయని, కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి



**కరీంనగర్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు రాష్ట్రాల ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లో గీత భక్త సమాజం సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, మౌనం పాటిస్తూ త్యాగస్ఫూర్తిని స్మరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు జాతి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన చూపిన మార్గం యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# మంచిర్యాలలో ఎన్నికల ఏర్పాట్లు

**తపాలా శాఖ ఉప కార్యాలయం ప్రారంభం**



**మంచిర్యాల, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, కౌంటింగ్ మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తామని, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. తరువాత కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. త్రాగునీరు, సౌచాలయాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదే రోజు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రజల సౌకర్యార్థం తపాలా శాఖ ఉప కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా పొదుపు ఖాతాలు, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, పార్సిల్ సేవలు, జీవిత భీమా, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి, సీనియర్ సిటిజన్ స్కీమ్ వంటి అన్ని తపాలా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# సిపిఎం ప్రచారం



**అచ్చంపేట, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామపంచాయతీ 1వ వార్డులో సిపిఎం బలపరిచిన అభ్యర్థి వర్ధం సైదులను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, మద్యం సమస్యను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. చదువుకున్న యువతకు గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా సహకరిస్తామని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అగత్యాలు జరగకుండా చూస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి 10వ తరగతి వరకు విస్తరించేందుకు కృషి చేస్తామని, నాణ్యమైన విద్య అందించి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే అవసరం లేకుండా చేస్తామని పేర్కొన్నారు. త్రాగునీరు, వైద్యం అందుబాటులో ఉండేలా ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని, క్రైమ్ రేటు లేని గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో సిపిఎం సీనియర్ నాయకులు బి. రాములు, శివకుమార్, అడ్డకూలి సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, దేవేందర్ రాజు, వీరయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## కంఠం గ్రామంలో అజిగిరి సాయినాథ్‌కు మద్దతుగా ప్రచారం



**నందిపేట్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండల కంఠం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అజిగిరి సాయినాథ్ (ఉంగరం గుర్తు)కు మద్దతుగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఘనంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేసే సజ్జన నాయకుడు సాయినాథ్ అని ప్రశంసించారు. గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, మహిళల సంక్షేమం వంటి అంశాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించారని తెలిపారు. సర్పంచ్‌గా ఎన్నికైన వెంటనే అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయని నమ్మకం వ్యక్తం చేశారు. కంఠం గ్రామ ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఉంగరం గుర్తుపై ఓటు వేసి సాయినాథ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, ఏబీవీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. గ్రామం మొత్తం ఉత్సాహం, విశ్వాసంతో నిండిన వాతావరణంలో ప్రచారం విజయవంతంగా కొనసాగింది.

## గ్రామాల్లో కమలం వికసిస్తుంది



హుజురాబాద్, డిసెంబర్ 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామాల్లో కమలం వికసిస్తోందని, మొదటి రెండు విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. రెండో విడత ఎన్నికల అనంతరం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, బిజెపి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం సంతోషకరమని, అనేక ప్రాంతాల్లో సర్పంచ్ స్థానాలకు గట్టి పోటీ ఇచ్చి వార్డు సభ్యులుగా గెలుపొందారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని, అందుకే పార్టీ అభ్యర్థుల వైపు మొగ్గు చూపారని ఆయన అన్నారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బిజెపి అభ్యర్థులు గెలిచిన చోట గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కేంద్ర మంత్రి ముందుకు సాగుతున్నారని, ఈ ఎన్నికల ఫలితాలు బిజెపికి గ్రామస్థాయిలో పెరుగుతున్న ఆదరణను స్పష్టంగా చూపిస్తున్నాయని కృష్ణారెడ్డి అన్నారు. భవిష్యత్తు బిజెపిదేనని ధీమా వ్యక్తం చేశారు.

## కొండపాకలో ఈటల రాజేందర్ ప్రచారం



**హుజురాబాద్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, సర్పంచ్ అభ్యర్థి ఈదునూరి కుమార్ (ఉంగరం గుర్తు)కు మద్దతు ప్రకటించారు. గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ పూలు చల్లి, మంగళహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కుమార్ 25 ఏళ్లుగా తనతోపాటు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తున్నాడని, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే నాయకుడని పేర్కొన్నారు. ఏ ఇంట్లో ఏ ఆపద వచ్చినా సహకరించే వ్యక్తి కుమార్ అని, ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు. వార్డు సభ్యులందరినీ కూడా గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# సిద్దిపేటలో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ర్యాండమైజేషన్




**సిద్దిపేట, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల భాగంగా మూడో విడత పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అధికారుల ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి ఆధ్వర్యంలో సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దుల్మిట్ట, కొండపాక, కుకునూరు పల్లి మండలాల్లోని 163 గ్రామాల్లో 1432 వార్డులకు పోలింగ్ నిర్వహించేందుకు 3841 మంది అధికారులను నియమించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ర్యాండమైజేషన్ పూర్తయిందని అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, తుది జాబితాలను సంబంధిత శాఖలకు పంపిణీ చేశామని తెలిపారు. తరువాత జూమ్ సమావేశం ద్వారా ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులకు ఎన్నికల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో టేబుల్స్, కుర్చీలు, మైక్ సిస్టమ్, తాగునీరు, భోజనం వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండాలని, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరగనుందని, మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతం నివేదించాలని, లైన్‌లో ఉన్న ఓటర్లకు టోకెన్ ఇచ్చి ఓటు హక్కు వినియోగించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు, పంచాయతీ అధికారులు, విద్యాశాఖ అధికారులు, జెడ్పీ సిఈఓ రమేష్, డిపిఓ రవీందర్, ట్రైనీ డిపిఓ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గురువన్నపేట పాఠశాల పరిశీలన

### క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లు



**కొమురవెల్లి, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొమురవెల్లి మండలం గురువన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు మరుగుదొడ్ల డోర్లు, విద్యుత్ మీటర్, తాగునీటి ట్యాప్‌లు ధ్వంసం చేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులతో మాట్లాడి తక్షణమే రిపేర్ పనులు చేయాలని ఆదేశించారు. ధ్వంసం చేసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. తరువాత చేర్యాల మండలంలోని గుర్జకుంట, వేచరేణి, కడవేర్గు, నాగపురి, ముస్త్యాల, ఆకునూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలను పరిశీలించారు. మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించిన ఈ కేంద్రాల్లో విద్యుత్, లైట్స్, ఫ్యాన్స్, ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వెబ్‌కాస్టింగ్ కోసం నెట్ కనెక్షన్, కౌంటింగ్ సెంటర్లలో పెద్ద గదులు, పోలింగ్ అధికారులకు భోజనం, టీ, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఓటర్ స్లిప్ పంపిణీ 100 శాతం పూర్తిచేయాలని బిఎల్‌ఓలకు సూచించారు. పోలింగ్ రోజున గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ వర్ధంతి సందర్భంగా నివాళులు

### - అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**హనుమకొండ, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: భారతదేశపు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పటేల్ దేశ సమగ్రతకు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. 562 సంస్థానాలను ఏకం చేసి భారతదేశాన్ని ఒకటిగా నిలబెట్టిన ఆయన దృఢ సంకల్పం ఈ రోజుకీ మార్గదర్శకమని అన్నారు. తరువాత కాజీపేట, హనుమకొండ పరిధిలోని పలు డివిజన్లలో రూ. 1.70 కోట్లతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. బోడగుట్ట, శాయంపేట, గుడిబండల్ ప్రాంతాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కాలనీ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని, నిర్ణీత గడువులోనే పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బోడగుట్ట గ్రామానికి రహదారి వెడల్పు చేయాలని ప్రజల అభ్యర్థనపై అధికారులకు సూచించారు. శాయంపేట దళిత కాలనీలో మిగిలిన రోడ్లను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలలో మూగబోయిన ప్రచార రధాలు




**అబ్దుల్లాపూర్ మెట్. డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ లోని కేంద్రంలో అన్ని గ్రామ పంచాయతీ పరిధిలోని 2 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడో విడత ఎన్నికల ప్రచారము ఈరోజు సాయంకాలం ఐదు గంటలకు మూగ వేయడం వేయడం జరిగింది అనంతరం కొన్ని గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులు వార్డు సభ్యుల అభ్యర్థులు హొరాహొరీగా పోరు జరుగుతూ ఉంది వీళ్ళ భవిష్యత్తు మూడో విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు 17 తేదీ బుధవారం నాడు సాయంకాలం ఎవరు అనేది బయటపడటం జరుగుతుంది ఊరికి రాజు ఎవరు వార్డు నెంబర్లు ఎవరు అనేది 17 తారీకు సాయంకాలం వెలుగులోకి వస్తాయి

## జగిత్యాలలో బిజెపి విజేతలకు బోగ శ్రావణి సన్మానం



**జగిత్యాల, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులుగా విజయం సాధించిన అభ్యర్థులను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి వారి స్వగృహంలో కలుసుకుని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్కూరి రాజన్న, కుర్మా రమేష్, ఓల్లాల రాజశేఖర్, బుర్ర వేణు, గనివేని నవీన్, గడ్డి మల్లేష్, ఎడ్ల మాధవి –మల్లేష్, గుండేటి శ్రీకాంత్, జుంగోని అజయ్, రెంటం గంగారెడ్డి, గోసంగారి నాగరాజు, మెల్ల లక్ష్మణ్, సిరికొండ గణేష్, బిరుదుల లచ్చన్న, బోనగిరి నడిపి గంగన్న, మామిడి పెల్లి రాజేందర్, మడ్డి మల్లేష్, అటుకుల సులోచన, బాపూరపు గంగన్న తదితరులు పాల్గొన్నారు.


# గ్రామాభివృద్ధే నా లక్ష్యం

**-మహాదేవ్ పూర్‌కు పూర్తి సహకారం**
**-ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి**



**కొందుర్గ్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాదేవ్ పూర్ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా తోడుంటానని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి స్పష్టం చేశారు. కొందుర్గ్ మండలం మహాదేవ్ పూర్ గ్రామంలో ఇటీవల ఎన్నికైన గ్రామ సర్పంచ్ బోడంపాటి అనుషరవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపిగడ్డ బాలరాజ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్యతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన బాధ్యతను సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామ సమస్యలను ఐక్యతతో పరిష్కరించి, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# చారకొండలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట నియోజకవర్గం చారకొండ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ సర్పంచ్ అభ్యర్థి బలరాం గౌడ్ మద్దతుగా నిర్వహించిన సభలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మీ ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొంది మీ సేవలో ఉన్నాను. స్థానిక సమస్యలు, అవసరాలు తెలిసిన నాయకుడు మనకు అవసరం. అందుకే ప్రజల్లో ఎప్పుడూ ఉండే బలరాం గౌడ్ ని లేడీ పర్స్ గుర్తు తరపున బరిలో నిలబెట్టాం. వీరు గెలిస్తే నా బలం రెట్టింపు అవుతుంది. నేను ఎమ్మెల్యేగా, వీరు స్థానిక ప్రతినిధిగా కలిసి పనిచేస్తేనే మన ప్రాంతానికి నిధులు, అభివృద్ధి వేగంగా వస్తాయి" అని అన్నారు. డిసెంబర్ 17న జరగనున్న స్థానిక ఎన్నికల్లో బలరాం గౌడ్ లేడీ పర్స్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ స్టేట్ నెంబర్ చారకొండ వెంకటేష్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లి మండలం బావుపేట లో సుకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో కన్నె స్వామఇంటి లో పడి పూజ



**కరీంనగర్ రూరల్ డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్ప్రెస్)**
ఈరోజు బావుపేట గ్రామంలో సుకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో వలస లక్ష్మణ్ కన్నె స్వామి లత వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ పంచామృతాభిషేక పూజ జరిగింది చాలా ఘనంగా జరిగింది పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు మరియు మహిళలు భక్తులందరూ పాల్గొన్నారు. దాదాపు 100 మంది అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు స్వామియే శరణం శరణం అయ్యప్ప అను మారు మోగింది

## ముదిరాజ్‌లు రాజకీయంగా ముందుండాలి

**-డా. బండ ప్రకాష్ ముదిరాజ్**




**వెల్దండ, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముదిరాజ్‌లు రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుండాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, మండలి వైస్ చైర్మన్ డా. బండ ప్రకాష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీశైలం నుంచి హైదరాబాద్ బయలుదేరిన క్రమంలో వెల్దండ మండల కేంద్రంలో కాసేపు ఆగి ముదిరాజ్ సమాజ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన వెల్దండ ఉపసర్పంచ్ బస్వ మోని ఎర్ర శ్రీను, వార్డు సభ్యులు మిరియాల మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, బాదేపల్లి రమేష్, చెరుకూరు గ్రామ వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, పురుగుల రమేష్‌లను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ అధ్యక్షుడు నూకం వెంకటయ్య ముదిరాజ్, జిల్లా యువజన అధ్యక్షుడు చందు, జిల్లా ఫిషరీస్ డైరెక్టర్ భూను చంద్ర, వెల్దండ మండల అధ్యక్షుడు బాదేపల్లి మల్లేష్, యువజన అధ్యక్షుడు బొక్కల శ్రీనివాస్‌తో పాటు అన్నెపు వెంకటేష్, మాసుల బాలరాజు, మొక్తల శ్రీనివాస్, కసారపు మల్లేష్, గంటల నరసింహ, రంగరాతీ శ్రీశైలం, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేటప్పుడు బ్యాలెట్స్ ను ఆర్వోలు తనిఖీ చేయాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి డిసెంబర్ 15( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఈనెల 17వ తేదీన పానుగల్, శ్రీరంగాపూర్, విపనగండ్ల, పెబ్బేరు, చిన్నంబావి మండలాల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ పాన్గల్, శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాల్లో పర్యటించారు.

పానగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య ఆర్వో లతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేటప్పుడు బ్యాలెట్ పేపర్లను ఆర్వోలు తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులు అన్ని ఉన్నాయో లేదో చెక్ చేసిన తర్వాతే సిబ్బందికి పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ బయట అతికించే ఫారం 9 వివరాలు సక్రమంగా రాసి అతికించాలన్నారు. ఈ రెండు విషయాల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాగ్రత్తగా పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులని అడిగి నివృత్తి చేసుకోవాలని, అంతేగాని పొరపాట్లకు మాత్రం తావు ఇవ్వొద్దని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో అభ్యర్థిని లేదా వారి ఏజెంట్లను మాత్రమే అనుమతించాలని, వారితో ఎలాంటి మొబైల్ ఫోన్ ను అనుమతించడానికి వీల్లేదని తెలియజేశారు. పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ స్థలాల పరిశీలన పానగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని సర్వవర్గ కమ్యూనిటీ హాల్, పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణల్లో మంగళవారం పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కొరకు చేయనున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి గందరగోళం లేకుండా పోలింగ్ సామాగ్రి పంపిణీకి ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బృందాలు, గ్రామ పంచాయతీల వివరాలతో రూట్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా టెంట్లు, భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఒంటిగంట కల్లా సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు బయలు దేరి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మూడో విడతలో పోలింగ్ జరగనున్న ఐదు మండలాల్లో డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఎలాంటి ప్రచారం కానీ, ఓటర్ స్లిప్పుల పంపిణీ కానీ చేయడం జరగవద్దన్నారు. ఈ రెండు రోజుల్లో మద్యం, ధన ప్రభావం కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పరిశీలన పానగల్, శ్రీరంగాపూర్, పెబ్బైర్ మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ పూర్తిగా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారం 14 దరఖాస్తు చేసుకున్న వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని సూచించారు. ఎన్నికల విధుల అపాయింట్మెంట్ ఆర్డర్ కాపీ, (వోటర్ ఐడీ) లేదా మరో గుర్తింపు కార్డు జిరాక్స్ తనిఖీ చేయాలన్నారు. ఓటు వేసిన వారిని ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలని సూచించారు ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆయా మండలాల తహసిల్దార్లు, ఎంపీడీఓ లు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# శాంతికి,సంతోషానికి ప్రతీక క్రిస్మస్





**-లోడీ సాంఘిక సేవ సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి**
**- పిల్లలు అధైర్య పడొద్దు అండగా ఉంటాం.**
**-లోడి సాంఘిక సేవా సంస్థ ప్రెసిడెంట్,వరంగల్ నేత్రాసనము అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ విజయపాల్ రెడ్డి.**
**-లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు**




**వరంగల్, డిసెంబర్ 15(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
శాంతికి,సంతోషానికి ప్రతీక క్రిస్మస్ పండగని లోడీ సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నా రెడ్డి అన్నారు. సోమవారం ఫాతిమా నగర్ లోని లోడీ సాంఘిక సేవా సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో లోడి సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది హెచ్ఐవి తో జీవిస్తూ వున్నా పిల్లలకు న్యూట్రిషన్ తో పాటు 525 మంది ప్రత్యేక నైపుణ్యం కలిగిన దివ్యాంగులకు దుస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి లోడి సాంఘిక సేవా సంస్థ ప్రెసిడెంట్, వరంగల్ నేత్రాసనము అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ విజయపాల్ రెడ్డి, ఆర్థిక సహాయము అందిస్తున్నటువంటిదాత గంగుల వెంకటరమణారెడ్డి, హైదరాబాద్ చాయ్ సంస్థ ప్రతినిధులు మరియు ప్రోగ్రాం మేనేజర్ ఇందిరా, వరంగల్ పాజిటివ్ నెట్వర్క్ రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి ముఖ్య అతిథులతో కలిసి కేక్ కటింగ్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు




తెలియజేశారు. అనంతరం ఫాదర్ విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. లోడీ సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గత 11 సంవత్సరాలుగా చిన్న పిల్లలతో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. హెచ్ఐవి బాధిత పిల్లలు ఆ ధైర్య పడద్దని అండగా మీకు లోడి సాంఘిక సేవా సంస్థ ఉంటుందన్నారు. లోడి సాంఘిక సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ఆర్థికంగా సహాయం అందిస్తూవున్న దాతల సహకారం మరువలేనిది అన్నారు. అదే విధంగా హెచ్ఐవి బాదిత పిల్లలకు న్యూట్రిషన్ సపోర్ట్ తో పాటు వారి చదువు కోసం గత 15 సంవత్సరాలుగా ఆర్థిక సహాయం అందజేస్తున్న గంగుల వెంకటరమణారెడ్డి హృదయం చాలా విశాలమైనది అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరైన చాయ్ ప్రతినిధుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సెమీ క్రిస్మస్ వేడుకలలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం 11 ఆశ్రమాల నుండి నృత్యాలు చేసిన విద్యార్థులకు నూతన దుస్తులు అందజేసి ఫాదర్ ఇన్నారెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దాతలకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లోడీ సాంఘిక సేవా సంస్థ స్టాఫ్ మరియు వివిధ గ్రామాల్లో పనిచేసే కార్యకర్తలు, పెద్దలు పిల్లలు తదితరులు ఉన్నారు.

## పుల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించిన విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటే



**చారకొండ, డిసెంబర్ 15 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చారకొండ మండల కేంద్రానికి చెందిన పుల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన, పుల్లమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.3000 అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, పుల్లమ్మ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత మల్లేష్, మాజీ జడ్పిటిసి రాంబాబు, అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజగోపాల్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.